క్లుప్తంగా

జిమ్నాస్టిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేత విద్యార్థులతో పీఈటీ శివకుమార్

ఏర్పేడు: రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయురాలు సునీత, పీఈటీ శివకుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన జీవన్‌కుమార్, అభిషేక్, ధనుష్, కాలేష్ బాలుర అక్రోబిక్స్‌లో మ్యాన్ గ్రూప్‌లో ఎంపికై రాష్ట్ర స్థాయి మూడో బహుమతిని సాధించినట్లు వివరించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

చేతిపంపునకు మరమ్మతులు చేపట్టండి



మరమ్మతులకు గురైన చేతిపంపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామం బీసీ కాలనీలోని చేతిపంపు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. చేతిపంపునకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు



బుచ్చినాయుడుకండ్రిగ: ఉగ్గుమూడి గ్రామంలో నిర్మించిన శివాలయంలో వెలసిన అన్నపూర్ణాదేవికి ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్టీలను దాతలు ఆదుకోవాలి



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: ఎస్టీలను దాతలు ఆదుకోవాలని యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్ కోరారు. ఆయన ఆదివారం చిందేపల్లి ఎస్టీ కాలనీలో 24 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీ గ్రామాల్లో చదువుకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు వివరించారు. ఎస్టీలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ ప్రతినిధులు అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక క్యాంపు



ఓటరు జాబితాలో తమ పేర్లను చూసుకుంటున్న ఓటర్లు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని పూడి పోలింగ్ కేంద్రంలో ఆదివారం బీఎల్వో జోషి నికేతన్ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ఓట్లను పరిశీలించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కలిగి ఉండాలని బీఎల్వో కోరారు. అలాగే ఎనిమిది మంది కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ

గూడూరురూరల్: స్థానిక త్యాగరాజావీధిలోని శ్రీకల్యాణ వీరభద్రస్వామి దేవస్థానం వద్ద ఆదివారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో 37 మంది పేద దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, దాత స్వర్ణలతమ్మ, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు విష్ణువందన, మహిళా మండలి అధ్యక్షురాలు జమునమ్మ, కార్యదర్శి స్నేహలతారెడ్డి, లక్ష్మి, అనిత, రెడ్ సంస్థ అధ్యక్షుడు జానా సుధీర్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పిచ్చాటూరు మండల అధ్యక్షులు చలపతిరాజు, పక్కన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



మంత్రి రామచంద్రారెడ్డిని తిరుపతిలో కలిసిన నాగలాపురం వైఎస్సార్ సీపీ నాయకులు

పిచ్చాటూరు/నాగలాపురం : పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైఎస్సార్ సీపీ పిచ్చాటూరు, నాగలాపురం పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సత్యవేడు నియోజకవర్గంలోని మండలాలకు పార్టీ అధ్యక్షులుగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు నాయకులు ఆదివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి మంత్రి పెద్దిరెడ్డిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడానికి కృషి చేయాలని సూచించారు. వారు మాట్లాడుతూ 2024లో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడానికి ఎన్నికల్లో సమష్టిగా పని చేస్తామన్నారు. నాగలాపురం మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడు తూ నాగలాపురం–టీపీ కోట రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని మంత్రికి వినతి పత్రం సమర్పించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం మండల అధ్యక్షుడు అపరంజిరాజు, రైతు సంఘం అధ్యక్షుడు చిన్నదొరై, ఎంపీపీ సింధూ శ్యామ్, వైస్ ఎంపీపీ కుమారి ఉదయకుమార్ రెడ్డి, జెసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, పళ్లికొండేశ్వర స్వామి ఆలయ సభ్యుడు ఎస్ఎం.సురేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతే రాజు



సదస్సులో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

వరదయ్యపాళెం: ప్రకృతి వ్యవసాయం రైతును రాజుగా మారుస్తుందని తిరుపతి జిల్లా రైతు సాధికార సంస్థ డీపీఎం షణ్ముగం తెలిపారు. మండలంలోని కోవూరుపాడులో ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను సక్రమంగా అమలు చేస్తే అధిక దిగుబడి పొంది ఆర్థికంగా అభివృద్ధిని సాధించవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని, అలాగే నాణ్యమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సామర్ల సుజాతమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో మోస్తరు వర్షం



బుచ్చినాయుడుకండ్రిగలో కురుస్తున్న వర్షం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 21 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షంతో చెరుకు, మామిడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆలత్తూరు, కొత్తకండ్రిగ, చిన్నయగుంట, పూసలపల్లి, ఆర్‌అనంతాపురం గ్రామాలకు వెళ్లే రోడ్లు రొచ్చురొచ్చుగా తయారయ్యాయి. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధం అవుతున్నారు. వరినాట్లు వేయడానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

శ్రీకాళహస్తి స్కౌట్ విద్యార్థులకు రాజ్యపురస్కార్



ఎ.తనూజ్‌కుమార్, జి.నిఖిల్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని బాబు అగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు స్కౌట్ విద్యార్థులు జి.నిఖిల్, ఎ.తనూజ్‌కుమార్‌కు ప్రతిష్టాత్మక రాజ్య పురస్కార్ అవార్డులు లభించాయి. వీరు ఈ ఏడాది 30న మదనపల్లిలో నిర్వహించిన రాజ్యపురస్కార్ టెస్టింగ్ క్యాంపులో ఉత్తీర్ణులయ్యారు. ఈ నెల 7వ తేదీన గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా వీరికి శిక్షణ ఇచ్చిన స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్‌ను రాష్ట్ర మండలి మాజీ సభ్యుడు రమేష్‌బాబు, జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులు ఎంఎం రెడ్డి, ఎం.జయరామ్, ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



బీఎన్‌కండ్రిగలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న డీటీ శివయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: ఓటు ప్రతి పౌరుడి హక్కని, అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దారు శివయ్య తెలిపారు. ఆయన ఆదివారం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా మండలంలోని 14, 12, 21 పోలింగ్ స్టేషన్లలో ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందన్నారు. మండలంలో కొత్తగా 60 మంది ఓటు కోసం నమోదు చేసుకున్నారని, చనిపోయిన 27 మంది పేర్లను జాబితా నుంచి తొలగించాలని తెలిపారు. అలాగే 123 మంది డోర్ నెంబర్లను సరిచేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటసుబ్బయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



సీఐ విక్రమ్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): దీపావళి పర్వదినం సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారులు లైసెన్స్ ఉంటేనే టపాసులు విక్రయించాలని తొట్టంబేడు సీఐ విక్రమ్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు నిర్దేశించిన స్థలాల్లోనే టపాసుల దుకాణాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా, లైసెన్స్‌లు లేకుండా టపాసులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆర్‌డీవో అనుమతి తీసుకుని గ్రామీణ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



నగరిలో కురుస్తున్న వర్షం

నగరిలో జోరు వర్షం

నగరి: పట్టణ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం జోరువర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా మబ్బులు కమ్ముకుంటున్నాయి. వరుణుడు దోబూచులాడుతూ వచ్చాయి. అయితే ఆదివారం మధ్యాహ్నం మాత్రం కుండపోత వర్షం పడింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు నీటితో నిండాయి. పాత నివాసాల్లో ఇదివరకు నీళ్లు ఉరవని ప్రాంతాల్లో కూడా వర్షపునీరు ఉరిసింది.

జీడీ నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం పడింది. దీంతో కాలువలు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మురుగు కాలువల్లో నీరు రోడ్లపైకి చేరింది. పలుచోట్ల భారీగా వర్షం పడడంతో పంటలకు తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉందని పలువురు రైతులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి – పిచ్చాటూరు రోడ్డులో నడిచే ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఆదివారం తిమ్మసముద్రం వద్ద మైసురారెడ్డి, షణ్ముగం దాడి చేశారు. బాధితుడు వినోద్‌కుమార్ కేవీబీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నుంచి బయలుదేరుతున్న సమయంలో రాజీవ్‌నగర్ వద్ద ఇద్దరు వ్యక్తులు ఫోన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంలో వెళుతున్నారని తెలిపారు. పక్కకు వెళ్లాలని రెండుసార్లు హారన్ కొట్టినట్టు పేర్కొన్నారు. వారు తనను అంతు చూస్తామని బెదిరించారని తెలిపారు. తాను పట్టించుకోకుండా వెళుతుండగా తిమ్మసముద్రం వద్ద బస్సును అడ్డగించి దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడిని అన్ని యూనియన్ల నాయకులు ఖండించారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు రక్షణ లేకుండా పోయిందన్నారు. విధుల్లో ఉన్న వారిపై దాడి చేయడం తగదన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

అండర్-14 క్రికెట్ సెలక్షన్స్ ప్రారంభం



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ జయప్రకాష్

పుత్తూరు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలుర అండర్–14 క్రికెట్ సెలక్షన్స్‌ను ఆదివారం స్థానిక ఎస్ఆర్ఎస్ జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన దేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ప్రతి క్రీడాకారుడు తమ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర, జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 150 మంది క్రీడాకారుల నుంచి జిల్లా ప్రాబబుల్స్ జట్లను ఎంపిక చేశారు. వీరికి నగరిలో రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం సుందరం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సురేష్, సర్పంచ్ కృపాకరన్, పీడీలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పలు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మహిళలు సంతానం కోసం ఆలయంలోని రావి చెట్టు, త్రిశూలం వద్ద వరపడ్డారు. ఊయల కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ట్రస్టు చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

లక్ష్మీనరసింహుని సేవలో సినీనటి జయలలిత





అన్నదాన సత్రంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న జయలలిత, ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో..

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామిని సినీ నటి జయలలిత ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం స్వామివారి అన్నదాన సత్రంలో భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి తమ ఆరాధ్య దైవమని ఆమె తెలిపారు.

డిసెంబరు 6న ఏడు గంగమ్మల జాతర



తిప్పగుంటపాళెంలో బీఎల్‌ఓలకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో డిసెంబరు 6న నిర్వహించే ఏడుగంగమ్మల జాతరను విజయవంతం చేద్దామని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద గల కల్యాణ మండపంలో ఆదివారం ఏడు గంగమ్మల ఆలయ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఇందులో ముఖ్య అతిథిగా అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 3న జాతర చాటింపు ఉంటుందని తెలిపారు. 5వ తేదీన శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఏడు గంగమ్మలకు సారె సమర్పిస్తామని పేర్కొన్నారు. ఇందులో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. డిసెంబరు 6న జాతర అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. జాతర అయిన తరువాత శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో ఏడుగంగమ్మల ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తామని చెప్పారు. అదే విధంగా తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ, వెంకటగిరి పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగలుగా ప్రకటించారని, శ్రీకాళహస్తి ఏడు గంగమ్మల జాతరను కూడా రాష్ట్ర పండుగగా ప్రకటించాలని పాలక మండలి తీర్మానం చేస్తూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించనున్నట్లు తెలిపారు. వారి ద్వారా ముఖ్యమంత్రిని ఒప్పించి ఏడుగంగమ్మల జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణమూర్తి, కరుణాకర్‌గురుకుల్, పాలమంగళం రవి, నాదముని, సెన్నీరుకుప్పం శేఖర్, షణ్ముగం, మొగరాల గణేష్, హరినాథ్‌నాయుడు, కార్తికేయ, జలకం కిషోర్, కంఠా ఉదయ్, గరికపాటి చంద్ర, శేఖర్, సత్య, శంకర్, బుగ్గ హరి, మచ్చవిజయ్, జగదీష్, బాలు, హర్ష, నితిన్, సాయి, గిరిప్రసాద్‌గౌడ్, బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే ఓట్లు



మాట్లాడుతున్న నాగరాజుగౌడ్

శ్రీకాళహస్తి: బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే తమ ఓట్లు వేస్తామని ఆ సంఘం నాయకులు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో రాజకీయంగా, ఆర్థికంగా బీసీలు వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు బీసీలను ఓ ఓటు బ్యాంకుగా చూస్తున్నారని తెలిపారు. బీసీలకు రాజ్యాధికారం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షణీయమన్నారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ కులగణన ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేయాలని, అలాంటి పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గురుసాయి, సోమశేఖర్ ఆచారి, మధుసూదన్‌రావు, కిరణ్, కుమార్‌గౌడ్, బాల, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో మందుబాబుల హల్‌చల్



శ్మశానంలో సమాధిపై కూర్చుని మద్యం సేవిస్తున్న మందుబాబులు

శ్రీకాళహస్తి: మందుబాబులు రెచ్చిపోతున్నారు. ఎక్కడ పడితే అక్కడ కూర్చొని మద్యం సేవించి బాటిళ్లను పగులగొడుతున్నారు. శ్రీకాళహస్తి మండలం ఈశ్వరయ్యకాలనీ సమీపంలోని శ్మశానవాటికలో కొందరు మందుబాబులు నిత్యం మద్యం సేవించి బాటిళ్లను పగులగొట్టి నానా హంగామా సృష్టిస్తున్నారు. దీంతో శ్మశానం మొత్తం గాజుపెంకులతో నిండిపోయిందని, అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాలను తీసుకువచ్చినప్పుడు గాజు పెంకులు గుచ్చుకుని గాయాలపాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. శ్మశానంలో మద్యం సేవించవద్దనని పలుమార్లు చెప్పినా పట్టించుకోకుండా గాజు పెంకులు వేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి శ్మశానవాటికకు ప్రహరీ గోడ నిర్మించి భద్రత కల్పించాలని కోరుతున్నారు.

స్వర్ణబిందు ప్రాసనకు విశేష స్పందన



ఏకం ఆలయ ప్రాంగణంలో పిల్లలకు స్వర్ణబిందు ప్రాసన చుక్కలు వేస్తున్న సిబ్బంది

వరదయ్యపాళెం: మండలంలోని లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పిల్లల్లో రోగ నిరోధక శక్తి, జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు స్వర్ణబిందు ప్రాసన కార్యక్రమం చేపట్టారు. దీనికి విశేష స్పందన లభించింది. ఏకం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో 300 మంది పిల్లలకు స్వర్ణబిందు ప్రాసన చుక్కల మందు పంపిణీ చేశారు. ప్రాచీన భారతీయ కశ్యప ఆయుర్వేద శాస్త్రం ప్రకారం తయారు చేసిన ఈ మందును పిల్లలకు ఉచితంగా అందజేస్తున్నట్లు లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులకు ఘన సన్మానం



బీజేపీ నాయకులను సన్మానిస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి: ఢిల్లీ కలశయాత్రను విజయవంతం చేసిన బీజేపీ నాయకులను ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా ఆనంద్ తన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మేరా మిట్టి – మేరా దేశ్ కార్యక్రమం కోసం రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రైలులో రాష్ట్రం నుంచి ప్రతి మండలం నుంచి పవిత్ర కలశాలతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి చేరుకున్నారని పేర్కొన్నారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన కలశాల మట్టితో అమృత్ ఉద్యానవన వాటికలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల స్మారక స్థూపం నిర్మిస్తారని తెలిపారు. సన్మానం అందుకున్న వారిలో మోహన్‌రావు, వెంకటేష్, చెంగ్రాయులు, బాలాజీనాయుడు, రాజానరసింహులు, గోపి ఉన్నారు. ఈ కార్యక్రమంలో మేశాగరం సుబ్రమణ్యంరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, వాసు యాదవ్, మునిరాజ, కన్నా వెంకటేశ్వర్లు, హరి తదితరులు పాల్గొన్నారు.

చేనేత జనగణనకు ప్రాధాన్యత ఇవ్వాలి



నక్కా వెంకటేశ్వరరావుకు ఆహ్వానం పలుకుతున్న కమిటీ సభ్యులు

సైదాపురం, వెంకటగిరి రూరల్: చేనేత జనగణనకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ నక్కావెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం వెంకటగిరిలో తిరుపతి జిల్లా చేనేత కమిటీ సదస్సుకు హాజరుకావాలంటూ వీవర్స్ కమిటి ప్రతినిధులు పలువురు ప్రతినిధులకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావుకు శాలువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మిక సంఘాలు, రాజకీయ విభాగాల కలయికతో జాతీయ స్థాయిలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. వీవర్స్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా కమిటీ ఏర్పాటులో అన్ని సామాజిక వర్గాల కలయికతో ప్రతిపాదనలు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాపకు మారస్వామి, కోడిపల్లిరాజా, మన్నెముద్దు శ్రీనివాసులు, గుత్తిత్యాగరాజు, గిరిప్రసాద్, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.